# నడిగడ్డలో కాంగ్రెస్ కుట్రలు

- మూటాముల్లే సర్దుకొని ఎవరు పోతారో త్వరలో తెలుస్తుంది
- జెడ్పీ చైర్‌పర్సన్‌గా జిల్లాలో చేసిన అభివృద్ధి చెప్పాలి
- హస్తం పార్టీ వాళ్లు రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- గౌడ కులస్తులకు అండగా ఉంటాం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



గౌడ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సమ్మేళనానికి హాజరైన గౌడ కులస్తులు



జిల్లెడబండలో రాములక్క పాటకు మహిళలతో కలిసి స్టెప్పులేస్తున్న ఎమ్మెల్యే

గద్వాల, నవంబర్ 21 : ''నడిగడ్డలో కులాల మధ్య చిచ్చు పెట్టడానికి గద్వాల కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఎన్నికల ప్రచారంలో ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు.. వారు ఎంత రెచ్చగొట్టినా బీఆర్‌ఎస్ కార్యకర్తలు రెచ్చిపోవద్దు..'' అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ తరఫున జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎంపికై.. పదవికి రాజీనామా చేయకుండా ఏ హోదాలో తొక్కుతా.. తాటతీస్తా.. ఇక్కడ లేకుండా చేస్తా అని మాట్లాడడం చూస్తుంటే మతితప్పినట్లు అనిపిస్తుందని ఎద్దేవా చేశారు. పదవిలో ఉన్నప్పుడు నడిగడ్డకు చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నడిగడ్డలో కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి కుట్రలు చేస్తుందని.. తిప్పి కొట్టాల్సిన అవసరం ప్రజలపైనే ఉందన్నారు. గద్వాలను అభివృద్ధి చేసే వ్యక్తి కావాలా.. ప్రజల మధ్య అలజడులు సృష్టించే వ్యక్తులు కావాలో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి మాటలతో గద్వాలలోని వ్యాపారులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, పాత కక్షలు, కుటుంబ సమస్యలను పార్టీ గొడవలుగా చిత్రీకరించడం ఆమెకే చెల్లిందన్నారు. ఈనెల 30వ తేదీ తర్వాత ఎవరు మూటాముల్లే సర్దుకొని, నోరు మూసుకొని బిచాణ ఎత్తుతారో తెలుస్తుందన్నారు. ఓడిపోతున్నామని తెలిసి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కోట్లు పెట్టి కాంగ్రెస్ సీటు కొన్నవారు గద్వాల ప్రాంతాన్ని ఏమి అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి దోచుకుని దాచుకునేందుకే రాజకీయాల్లోకి వచ్చారని విమర్శించారు. మరోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే గద్వాల ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, నాయకులు రమేశ్‌నాయుడు, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రైతులను ఏనాడైనా పట్టించుకున్నారా?

రాష్ర్టాన్ని 13మంది కాంగ్రెస్ ముఖ్యమంత్రులు పాలించారు.. వారు ఏనాడైనా రైతుల గురించి పట్టించుకున్నారా? వారి కుటుంబాలకు మేలు జరిగే ఒక్క పథకమైనా ప్రవేశపెట్టారా? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మంగళవారం గద్వాల మండలంలోని సంగాల, మర్లపల్లి, జిల్లెడబండ గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించగా ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. జిల్లెడబండలో రాములక్క పాటకు మహిళలతో కలిసి ఎమ్మెల్యే, నాయకులు డ్యాన్స్ చేశారు. కాంగ్రెస్ నాయకులు రైతులకు మూడుగంటల కరెంట్ చాలని చెబుతున్నారు.. అలా చేస్తే రైతు ఎంత పొలానికి నీరు పారబెట్టుకుంటాడో వారే చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలో ఏనాడూ సాగు, తాగునీటి గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రజలు మూడు గంటల కరెంటిచ్చే కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేస్తారో.. 24 గంటల కరెంటిస్తున్న బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తారో ఆలోచించుకోవాలని సూచించారు. రైతులకు మేలుచేసే ఒక్క పథకమైనా వారు ప్రవేశపెట్టారా? అని ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకులు చెప్పిన మాటలు నమ్మి ప్రజలు ఓటేస్తే కష్టాలు తప్పవన్నారు. గద్వాల నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలని, అందుకు ఓటర్లు సహకరించాలని కోరారు. 70ఏళ్లలో ఏమీ చేయలేదు.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారని నిలదీశారు. ''ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి తాట తీస్తా, పాతాళానికి తొక్కుతా అని ప్రజలను భయపెట్టే రీతిలో మాట్లాడుతుంది.. నన్ను తొక్కడానికి, నా తాట తీయడానికి వారి చేతనైతదా..'' అని ప్రశ్నించారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. అభివృద్ధి చెందుతున్న గద్వాలలో వారి మాట తీరుతో వ్యాపారులు భయపడుతున్నారన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు స్పందించొద్దని, ఓటు ద్వారా వారికి బుద్ధి చెప్పాలని సూచించారు. ప్రచారంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, గడ్డం కృష్ణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, రమేశ్‌నాయుడు, రమేశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వాసు, శ్రీరాములు, జగదీశ్వర్‌రెడ్డి, నీలేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కుల వృత్తులకు పూర్వవైభవం


గత ప్రభుత్వాలు గౌడ కులస్తులను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని, స్వరాష్ట్రంలో కులవృత్తులకు పూర్వవైభవం వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. జమ్మిచేడు సమీపంలోని సీఎన్‌జీ హాల్‌లో గౌడ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. గతంలో కల్లు వ్యాపారంలో గౌడ కులస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారని, స్వరాష్ట్రంలో వారికి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున సర్దార్ పాపన్న విగ్రహం ఏర్పాటు చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ సర్కారేనన్నారు. గద్వాలలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధుల కేటాయింపుతోపాటు పాపన్న విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తానని తెలిపారు. గౌడ కులస్తులకు అండగా ఉంటానని, ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు బీఆర్‌ఎస్‌లో గౌడసంఘం నాయకులు చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమ్మేళనంలో ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టుకూ సాగునీరిస్తాం

- అది నా బాధ్యత
- ఏడాదిలోగా రిజర్వాయర్లు పూర్తి చేస్తాం
- లిఫ్టులు ఏర్పాటు చేస్తాం
- ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా
- విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలి: ఎమ్మెల్సీ చల్లా



బోరవెల్లిలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి



పల్లెపాడులో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్సీ చల్లా

మానవపాడు, నవంబర్ 21 : అలంపూర్ నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే పూర్తి బాధ్యత తనదని, అందుకు అవసరమైన రిజర్వాయర్లు, లిఫ్టులు ఏడాదిలోగా పూర్తి చేయిస్తామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం మానవపాడు మండలంలోని బోరవెల్లి, పల్లెపాడు, చండూరు గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడి తరపున ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బోరవెల్లిలో ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రైతులకు కష్టాలు లేకుండా చూస్తామని, పల్లెలను వందశాతం అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే భవిష్యత్ ఆగం కావాల్సిందేనన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇస్తే చేసి చూపిస్తారన్నారు. తనవంతుగా అలంపూర్ ప్రజల వెన్నంటి ఉండి ప్రజల అబివృద్ధే లక్ష్యంగా పాటుబడతానన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి ఇంటికీ సంక్షేమ చేకూరేలా ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రైతులకు 24గంటల విద్యుత్, సాగునీటిని అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని నమ్మిన సీఎం కేసీఆర్ సాగునీటికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి ఆర్డీఎస్ కాల్వ వరకు సమాంతర కాల్వ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే తుమ్మిళ్ల రిజర్వాయర్ కింద అవసరమైన మల్లమ్మకుంట, జూలెకల్ రిజర్వాయర్లను పూర్తి చేస్తామన్నారు. గార్లపాడు లిఫ్ట్ ఏర్పాటుకు నీటి లభ్యత ఎంతవరకు ఉందో అంచనా వేయించి సర్వే చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లోని సమస్యలన్నీ పరిష్కరించే బాధ్యత తానే తీసుకుంటానని తెలిపారు. పల్లెపాడులో వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తూ పింఛన్, రైతుబంధుపై ఆరా తీశారు.

# అభివృద్ధిని చూసి అండగా నిలవాలి

- సీఎం కేసీఆర్ పాలనలోనే పల్లెల అభివృద్ధి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు



వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు, వడ్డేపల్లి శ్రీనివాసులు

రాజోళి, నవంబర్ 21 : తెలంగాణలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలని, ఎన్నికల వేళ ప్రతిపక్షాలు చెప్పే మాటలను నమ్మొద్దని బీఆర్‌ఎస్ అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు సూచించారు. మంగళవారం రాజోళి మండలంలోని ముండ్లదిన్నె, పెద్ద తాండ్రపాడు, తుమ్మిళ్ల, తూర్పు గార్లపాడు గ్రామాల్లో సీనియర్ నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాసులుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మద్దతుదారులు, ప్రజలు పెద్ద ఎత్తున వారికి స్వాగతం పలికారు. అలంపూర్ నియోజకవర్గ రైతులకు సీఎం కేసీఆర్ తుమ్మిళ్ల ఎత్తిపోతలతో అండగా నిలిచారని విజయుడు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని శ్రీనివాసులుతో కలిసి ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ చంద్రగౌడ్, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ముండ్లదిన్నెలో విజయుడికి మద్దతుగా మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ

### ప్రతి పల్లెలో కేసీఆర్ పేరే..

వడ్డేపల్లి, నవంబర్ 21 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు కేసీఆర్ నాయకత్వమే కావాలని, కారు గుర్తుకే ఓటు వేస్తామని ఆనందంగా చెబుతున్నారు. సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు నాయకత్వంలో మంగళవారం అభ్యర్థి విజయుడితో కలిసి పలు పల్లెల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైపాడు, శాంతినగర్, కోయిలదిన్నె, బుడమొర్సు, జిల్లెడదిన్నె, కొంకల గ్రామాల్లో తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, ఇచ్చిన హామీలను ప్రజలకు వివరిస్తూ కారుగుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, వడ్డేపల్లి కౌన్సిలర్ అజయ్‌కుమార్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.